ప్రజాశక్తి
ఆదివారం 18, జూన్ 2023 | 5 | అనంతపురం



గాడిద పాలు 20 ఎంఎల్ రూ.100

ప్రజాశక్తి-నార్పల

గాడిద పాలు 20 మిల్లీలీటర్లు రూ.100కు విక్రయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన ఐదుగురు మహిళలు ఐదు గాడిదలను తీసుకొచ్చి నార్పలలో ఇళ్లిళ్లూ తిరుగుతూ గాడిద పాలు విక్రయిస్తున్నారు. గాడిద పాలు తాగితే చిన్న పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందనేది చాలామంది నమ్మకం. అయితే ఈ మధ్యకాలంలో గాడిదలు కరువైన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మహబూబ్‌నగర్‌కు చెందిన ఐదురుగు మహిళలు ఒక్కొక్క గాడిదకు సుమారు రూ.50వేలు వెచ్చించి ఐదు గాడిదలు తీసుకుని నార్పలకు విచ్చి ఇంటింటికీ వెళ్లి అవసరమైన వారికి పాలు విక్రయిస్తున్నారు.



నార్పల వీధుల్లో గాడిదను పట్టుకుని వెళ్తున్న మహిళ



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజలపై భారాలు మోపేలా పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డి దారిన విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అధిక భారాలు మోపుతోందన్నారు. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు, మరోపక్క విద్యుత్ ధరలు పెంపుదలతో ప్రజలు కష్టాల్లోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. గత సంవత్సరం రూ.1400 కోట్లు విద్యుత్ సర్దుబాటు పేరుతో భారం మోపారని విమర్శించారు. ఈ ఏడాది రూ.6 వేల కోట్లు భారం ప్రజలపై మోపడం అన్యాయంగా ఉందన్నారు. 2014 సంవత్సరం నుంచి యూనిట్ 20 పైసల చొప్పున అదనపు భారాన్ని వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ట్రూఆఫ్ సర్‌ఛార్జీలను ఉప సంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక, జిల్లా నాయకులు క్రిష్ణవేణమ్మ, రామాంజినమ్మ, రేణుక, మంజుల, లక్ష్మి, దేవమ్మ, కవిత, జ్యోతి, లక్ష్మినరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలంలో ఎండలు


ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాభావం
ఆందోళనలో రైతులు



జూన్ వచ్చిందంటే వానలు మొదలవుతాయి. దీంతో వర్షకాలం మొదలైనట్టే. రుతుపవనాలు వచ్చేస్తాయి. కాని ఈసారి ఇప్పటికీ రుతుపవనాలు జిల్లాకు చేరుకోలేదు. ఇప్పటికీ ఎండలు దంచేస్తున్నాయి. మే నెలలో లాగానే ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటోంది. దీంతో జనం ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఒకవైపు జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమవుతుంది. రైతులు దుక్కులు దున్నుకుని విత్తనం విత్తుకునేందుకు సమయత్తమయ్యే సమయం. కాని ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. సాధారణం కంటే ఐదు శాతం నుంచి ఏడు శాతంలోపు ఎండలు అధికంగా ఉన్నాయి. మరోరెండు రోజులు ఇలాగే కొనసాగే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. అనంతపురం జిల్లాలో 31 మండలాలున్నాయి. ఇందులో శుక్రవారం ఐదు మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంది. శనివారం ఏకంగా 11 మండలాలు సాధారణం కంటే అధికంగా ఎండ తీవ్రత ఉంది. ఇక 18వ తేదీ ఎండ తీవ్రత తగ్గే అవకాశాలున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక సత్యసాయి జిల్లాలో 32 మండలాలున్నాయి. శుక్రవారం అంతటా సాధారణ వాతావరణమే నెలకొంది. శనివారం మాత్రం ఐదు మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంది. 18వ తేదీన అన్ని మండలాల్లోనూ సాధారణ వాతావరణమే కొనసాగనుంది.



సీజన్ ప్రారంభంలోనే వర్షాభావం

సీజన్ ప్రారంభంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాల్లో సాధారణ వర్షపాతం 46.7 మిల్లిమీటర్లు కాగా, ఇప్పటిదాకా 30.6 మిల్లిమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. దీన్ని బట్టి చూస్తే 34.5 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. సత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. 32 మండలాల్లో సాధారణ వర్షపాతం 51.6 మిల్లిమీటర్లకుగానూ 27.2 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయింది. దీన్ని బట్టి చూస్తే 47.3 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. అనంతపురం జిల్లాలో 12 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఎనిమిది మండలాల్లో వర్షాభావం నెలకొంది. సత్యసాయి జిల్లాలో 12 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయి. పది మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సీజన్ ప్రారంభంలోనే ఇటువంటి పరిస్థితులు నెలకొనడంతో పంటలు ప్రభావం చూపనుంది. మే నెలలో మంచి వర్షాలు పడినప్పటికీ జూన్ నెలలో సీజన్ ప్రారంభం నుంచి పడకపోవడంతో రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితులు కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలివ్వాలి

సిపిఎం నగరకార్యదర్శి వి.రామిరెడ్డి



తహశీల్దార్ కార్యాలయ ముట్టడిలో పాల్గొన్న నాయకులు, పేదలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు ఎనిమిది నెలలుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని వారిలో అర్హులైన వారందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి వి. రామిరెడ్డి డిమాండ్ చేశారు. అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో సిపిఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దార్ కార్యాలయాన్ని శనివారం ముట్టడించారు. సిపిఎం నగర కమిటీ నాయకులు ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో వి. రామిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని ఎనిమిది నెలలుగా సిపిఎం ఆధ్వర్యంలో పేదలకు అనేక రకాలైన ఆందోళనలు చేసిన రెవెన్యూ అధికారులకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం పని చేయాల్సిన అధికారులు అధికారం, డబ్బు ఉన్నటు వారికి తమ సేవలను వినియోగిస్తున్నారని విమర్శించారు. రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని 4-7ఎ,4-7బి, 4- 8ఎ 4-8బి సర్వే నెంబర్లలో 8 నెలల క్రితం పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. కానీ కొందరు ధనాన్ని అధికారాన్ని ఉపయోగించుకుని ఆ భూమి తమదని అధికారులకు అర్జీలు పెట్టి పేదలను అక్కడి నుండి తరిమివేయాలని చూస్తున్నారని విమర్శించారు. అధికారులు ఆ సర్వే నెంబర్లలోని భూమిని సర్వే చేసి పేదలకు పంచాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. అధికారులు తప్పుడు సర్వేలు చేసి ప్రభుత్వ భూమిని కొందరికి కట్టబెట్టాలని చూస్తున్నారని, ఇలాంటి వాటిని సిపిఎం ప్రజా పోరాటం ద్వారానే ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు. స్పందించి తహశీల్దార్ అర్హులైన పేదలకు స్థలాలు కేటాయించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తావించిన సర్వే నెంబర్లను సర్వే చేయించి ప్రభుత్వ భూమి అయితే పైఅధికారులకు తెలియజేసి పేదలకు పంపిణీ చేస్తామన్నారు. గతంలో కొంతమంది అధికారులు కొందరికి అక్రమంగా పట్టాలు, పాస్‌బుక్కులు ఇచ్చారని సిపిఎం నాయకులు ఈసందర్భంగా తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై విచారణ చేయిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు వెంకటనారాయణ, నగర నాయకులు ప్రకాష్, మసూదు, వలీ, బాబు, నురుల్లా, ప్రసాదు, లక్ష్మీనారాయణ ఎస్కే మహమ్మద్, కుమార్, శివ, మోహన్, షరీఫ్, వలి, పీరా, మహబూబ్ బాషా, శంషాబాద్, మాబ్బీ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆణిముత్యాల చెక్కును అందజేస్తున్న మంత్రి, తదితరులు

విద్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖామంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర స్త్రీ, శిశు, సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జగనన్న ఆణిముత్యాలు జిల్లా స్థాయి పురస్కార ప్రధాన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర స్త్రీ,శిశు, సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ మంత్రి కెవి. ఉషశ్రీ చరణ్, ఆత్మీయ అతిథులుగా జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, గౌరవ అతిథులుగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, విశిష్ట అతిథులుగా శాసనమండలి సభ్యురాలు మంగమ్మ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్. ఎం. ఉమాదేవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి, రజక కార్పొరేషన్ ఛైర్మన్ రంగన్న తదితరులు హాజరయ్యారు.

అనంతపురం నగర కార్పొరేషన్ మేయర్ వసీం మొహమ్మద్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ముఖ్యంగా పిల్లలకు బంగారు బాట వేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. పిల్లల చదువులో ఏ తల్లికి భారం కాకూడదనే ఉద్దేశంతో నవరత్నాలు - అమ్మఒడి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు - నేడు పథకం ద్వారా రూపురేఖలను మార్చినట్లు వివరించారు. అనేక పథకాలతో విద్యకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జగనన్న ఆణిముత్యాలు అనే వినూత్న పథకం ద్వారా 10, ఇంటర్ పరీక్షలలో అత్యున్నత ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు.కలెక్టర్ యం. గౌతమి మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం విద్యార్థులకు వరం లాంటిదని పేర్కొన్నారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో బాగా చదువుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత వందశాతం లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు పొందాలని కోరారు. అదే విధంగా నగర మేయర్, డిప్యూటీ మేయర్లు ,రాష్ట్ర ఉర్దూ అకాడమీ తదితరులు మాట్లాడుతూ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి రాష్ట్ర ప్రగతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. అనంతరం ప్రతిభా విద్యార్థులకు నగదు పురస్కారాలు, మెడళ్లు, సర్టిఫికెట్లు అందజేసి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కళాశాలల ప్రిన్సిపల్ విద్యార్థులు తల్లిదండ్రులను వేదికపై సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం, ఆర్‌ఐఒ సురేష్ బాబు, డివిఇఒ వెంకటరమణ నాయక్ , డిప్యూటీ డిఇఒలు పద్మప్రియ, శంకర్ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఎఎఫ్ ఎకాలజీ డైరక్టర్ డాక్టర్ మల్లారెడ్డి

యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్‌కు 4వ జాతీయ జలఅవార్డు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్‌కు " 4వ జాతీయ జల అవార్డు" కైవసం చేసుకుంది. జిల్లాలో జల వనరుల అభివృద్ధి, మెట్ట వ్యవసాయంలో కరువు నుంచి రక్షించడానికి ఫారం పాండ్స్, రక్షకతడి, మిశ్రమ పంటలు, అంతర పంటలు తదితరవి విస్తృతంగా అమలు చేస్తూ విశేష కృషి చేసినందుకు యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్‌కు 4వ జాతీయ జల అవార్డు వరించింది. శనివారం భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 4వ జాతీయ జల అవార్డుల ప్రధానోత్సవం న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించారు. జాతీయ స్థాయిలో జల వనరుల అభివృద్ధి, నిర్వహణ కొరకు విశేష కృషి చేస్తున్న సంస్థలకు వివిధ కేటగిరీల క్రింద నేషనల్ వాటర్ అవార్డులు ప్రధానం చేశారు. జిల్లాలోని యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సంస్థకు ఉత్తమ ఎన్‌జిఒ కేటగిరిలో స్పెషల్ కన్సోలేషన్ అవార్డును ప్రదానం చేశారు. భారత జలశక్తి మంత్రిత్వ శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ చేతుల మీదుగా ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవి.మల్లారెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ జాతీయ అవార్డులో భాగంగా ప్రశంసాపత్రం, నగదు పురస్కారం, ట్రోఫీని ప్రధానం చేశారు. 40 సంవత్సరాలుగా ఎఎఫ్ ఎకాలజీ సంస్థ కరువు పీడిత అనంతపురం జిల్లాలో వర్షాధార వ్యవసాయాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టింది. భూసార, నీటి సంరక్షణ, కరువు నివారణ, సుస్థిర వ్యవసాయం మొదలగు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఎన్జీవో కేటగిరీలో ఈ అవార్డును ఎంపిక చేశారు. ఈ సందర్భముగా మల్లారెడ్డి మాట్లాడుతూ సంస్థ పనిని గుర్తించి, కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులందరూ సమన్వయం చేసుకుని రైతులకు అందుబాటులో ఉండటంతోపాటు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉరవకొండ డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం చేపట్టిన 40శాతం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులందరికీ సకాలంలో పంపిణీ చేయడంతో పాటు సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు వీలైనంత త్వరలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామస్థాయిలో టెక్నికల్ సమస్యలు ఎదురైతే వెంటనే మండల జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే కౌలు పత్రాల గురించి, పీఎం కిసాన్, రైతు భరోసా పెండింగ్ రైతులతో త్వరగా ఇకెవైసి చేయించాలన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉరవకొండ డివిజన్ పరిధిలో చిరుధాన్యాల సాగు పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చిరు ధాన్యాల సాగు చేయడానికి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాలు గురించి రైతులకు వివరించాలన్నారు. చిరుధాన్యాల సాగు పెరగడం వల్ల మానవ కోటికి మేలు చేసిన వారమవుతామన్నారు. అంతేగాకుండా రైతుల ఆదాయంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీసాయి ఆగ్రో ఏజెన్సీస్ పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలు, మందులను మాత్రమే విక్రయించాలన్నారు. అలాగే నిర్ధేశించిన ధరలకు కాకుండా అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్‌లోని వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య, మధుకర్, స్వాతి, సాంకేతిక వ్యవసాయ అధికారులు వెంకట్‌కుమార్, రాకేష్‌నాయక్, బాలానాయక్, డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ, సిరికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం

ఇద్దరు కుమారులకు గాయాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

అనంతపురం జిల్లా ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిలంలో వద్ద శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు. ఇద్దరు చిన్నారులు గాయాలపాలయ్యారు. అందుకు సంబందించిన వివరాలు... అనంతపురం నగరంలోని మారుతీనగర్‌కు చెందిన భార్యాభర్తలు నాగరాజు (33), స్వాతి (28) కుటుంబంతో సహా కణేకల్‌లో జరిగిన జాతరకు వెళ్లారు. జాతర అనంతరం శనివారం తిరిగి అనంతపురానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఉరవకొండ మండలం పెన్నోబిలం వంతెన సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు, స్వాతి అక్కడికక్కడే మృతిచెందారు. ఇద్దరు కుమారులు నాలుగేళ్ల హేమంత్, రెండేళ్ల భానుప్రకాష్ గాయాలపాలయ్యారు. స్థానికులు గాయపడిన వారిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఉరవకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఉరవకొండ పోలీసులు తెలిపారు.

23 నుంచి ఉమ్మడి అనంత జిల్లాల్లో బస్సుయాత్ర

టిడిపి ఉమ్మడి అనంత జిల్లాల అధ్యక్షులు కాలవ, పార్థసారథి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత నారా చంద్రబాబు రాజమండ్రి మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈనెల 23వ తేదీ నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో బస్సుయాత్ర చేపట్టనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కాలువశ్రీనివాసులు, బికె.పార్థసారథి తెలిపారు. శనివారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల సందర్భంగా టిడిపి చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మినీ మేనిఫెస్టోపై ప్రజలకు వివరించడానికి బస్సుయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. తొలి దశలో రాష్ట్రంలో ఎంపిక చేసిన పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక్కొక్క పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బస్సుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. జోన్-5లో హిందూపురం, అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప పార్లమెంట్‌లకు సంబంధించి 25 నియోజకవర్గాల్లో బస్సుయాత్ర ఉంటుందన్నారు. ఈనెల 23న కదిరి నరసింహస్వామి పాదాల చెంత నుంచి నుంచి ప్రారంభమై పుట్టపర్తి, పెనుకండ, మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు, అనంతపురం, శింగనమల, గుత్తి, గుంతకల్ మీదుగా కర్నూలు జిల్లాలోకి బస్సుయాత్ర ప్రవేశిస్తుందన్నారు. 10 రోజుల పాటు ఉమ్మడి జిల్లాల్లో బస్సుయాత్ర కొనసాగి జూలై 2న గుంతకల్లు నియోజకవర్గంలో ముగుస్తుందన్నారు. అలాగే పల్లె నిద్రలు చేసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, కందికుంట వెంకటప్రసాద్, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా మహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, ఆదినారాయణ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

దిశా పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లా కేంద్రంలోని దిశా పోలీస్‌స్టేషన్‌ను డిఐజి అమ్మిరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను తనిఖీ చేసి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో పకడ్బందీగా పెట్రోలింగ్ చేసి ఈవ్ టీజర్ల భరతం పట్టాలని ఆదేశించారు. అలాగే షీ టీమ్స్ చురుగ్గా పని చేయాలన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎడబాటులో ఉన్న కుటుంబాల బాధలను క్షుణ్ణంగా విని సమస్యలకు సరైన పరిష్కారాలు చూపాలన్నారు.



దిశా పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి

లింగవివక్ష, అతిసారపై అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని మోపిడి గ్రామం ఎస్సీ కాలనీలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో లింగవివక్ష నిర్మూలన, అతిసార నివారణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ నాగరంగయ్య,హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ మాట్లాడుతూ మోపిడి గ్రామంలో లింగ నిష్పత్తిలో అధిక వ్యత్యాసం ఉందన్నారు. ఆడపిల్లల సంఖ్య కన్నా మగ పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండడంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. ఇక్కడ కొంతమంది తల్లిదండ్రులు మగపిల్లపై ఇష్టంతో గర్భంలో ఉన్నది ఏ శిశువో స్కానింగ్ ద్వారా తెలుసుకుని అబార్షన్లకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇలా చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. కాగా ఐదేళ్లలోపు పిల్లల్లో ప్రబలే అతిసార వల్ల మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా అతిసారకు కలుషిత నీరు, ఆహారం ప్రధాన కారణమన్నారు. కావున ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలన్నారు. అలాగే ప్రతి పిల్లవాని వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో ఉంచాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సీఓ భగవాన్‌దాస్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఎరువులు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ రవి

గార్లదిన్నె : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని ఎడిఎ రవి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో నిర్వహించిన ఫర్టిలైజర్ షాపుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీలర్లందరూ మార్గదర్శకాల ప్రకారం దుకాణాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలని తెలిపారు. అలాగే ప్రతిరైతుకూ కొన్న వాటికి బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఆర్‌బికె సిబ్బంది, ఎరువులు షాపుల డీలర్లు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

సచివాలయాలతో పారదర్శక పాలన

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని శ్రీరంగాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు అందించి ఆదుకోవడంతో సచివాలయ సిబ్బంది కృషి ఎనలేనిదన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థను రాష్ట్రంలో ఏర్పాటు చేసి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన ఏకైక సిఎం జగన్ అన్నారు. అంతేగాకుండా ప్రజా పరిపాలనలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి గ్రామస్వరాజ్యం దిశగా పయనిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నాగిరెడ్డి, శివలింగప్ప, రామాంజనేయులు, శ్రీరంగపురం సర్పంచి మారుతీరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, నరిగన్న, తహశీల్దార్ హుస్సేన్‌పీరాసాబ్, ఎంపిడిఒ రామచంద్ర, ఎఒ పృథ్వీసాగర్, హౌసింగ్ ఎఇ శివారెడి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కురుగుంట వంశీ ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన వంశీ ఆత్మహత్యకు కారకులైన వారిని చట్ట పరంగా శిక్షించడంతోపాటు బాధితుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సిపిఎం అనంతపురం రూరల్ మండలం కమిటీ కార్యదర్శి టి.రామాంజినేయులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూరల్ పరిధిలో వందల ఎకరాలు భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు రాతపూర్వకంగా వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

భూదందాల విషయం కథనాలు పత్రికలు ప్రచురించాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా ఉండడం వల్లే రూరల్ మండల గ్రామంలో ఉన్నటువంటి నిజమైన భూలబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందన్నారు. కురుగుంట గ్రామంలో నివసిస్తున్నటువంటి వంశీ చావుకు కూడా రెవెన్యూ అధికారులు బాధ్యత వహించాలన్నారు. వంశీ సూసైడ్ నోట్‌లో ఎవరు పేర్లు అయితే కనపరిచారో వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్ట పరంగా శిక్ష పడే విధంగా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

99 శాతం హామీల అమలు

మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం విజయవంతంగా అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి ఉషాశ్రీచరణ్ అన్నారు. శనివారం స్థానిక టీ.సర్కిల్‌లో ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేసిన సందర్భంగా ఉద్యోగులు సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేం చేశారు. అనంతరం క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చెత్త సేకరణకు మున్సిపాలిటీకి కేటాయించిన ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేసిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించారన్నారు. దీంతో వారి కుటుంబాల్లో సంతోషం నింపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ నాయకులు మాధవ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, పలువుకు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజాభిమానం కోల్పోయిన వైసిపి నాయకులు టిడిపి మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో రాయదుర్గం రూరల్ మండల పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొమ్మనహాల్, ఎల్బీ నగర్ గ్రామాల్లో టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించాలని విప్ కాపు రామచంద్రారెడ్డి కొంతమంది అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తనకు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. నియోజకవర్గంలోని మిగతా ప్రాంతాల్లో కూడా ఇలాంటి కుయుక్తులు జరుగుతున్నాయన్నారు. కావున గ్రామాల్లో ఓటర్ల జాబితాను ఒకటికి నాలుగుసార్లు చూసుకోవాలన్నారు. గత ఎన్నికల ఓటరులిస్టుతో ప్రస్తుత జాబితాను సరిచూసుకోవాలన్నారు. ఎవరి ఓట్లయినా గల్లంతై ఉంటే సదరు సమాచారాన్ని తమకు చేరవేయాలని కోరారు. కాగా రాజమండ్రి మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అలాగే యువనేత నారా లోకేష్ రాయలసీమ అభివృద్ధిపై చేసిన ప్రకటన అంశాలను కూడా తెలియజేయాలన్నారు. గ్రామాల్లో చిన్నపాటి అభిప్రాయభేదాలతో స్తబ్దుగా ఉన్న నాయకులను గుర్తించి టిడిపి అధికారంలోకి రావాల్సిన చారిత్రక అవసరాన్ని వివరించాలన్నారు. అందరం కలిసి కట్టుగా శ్రమిస్తే అత్యధిక మెజారిటితో రాయదుర్గంలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా రైతు ఉపాధ్యక్షుడు వెంకటేశులు, రవి, సర్పంచులు రాజశేఖర్, ఆశోక్, మల్లేశప్ప, వన్నూరుస్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, సోము, వీరేష్‌స్వామి, నాగిరెడ్డిపల్లి హనుమంతు, సిద్ధప్ప, ఆంజనేయులు, తిమ్మారెడ్డి, గోవిందరాజులు, ఆశోక్, తిమ్మారెడ్డి, జోగప్ప, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రాంతాల వారీగా మేనిఫెస్టోను రూపొందించాలి

చర్చాగోష్టిలో న్యాయ విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

ఆయా రాజకీయ పార్టీలు ప్రాంతాలవారీగా వనరులు, అవసరాలకు అనుగుణంగా తమ మేనిఫెస్టోలను రూపొందించుకోవాలని పలువురు న్యాయ విద్యార్థులు ఏకగ్రీవంగా తీర్మానించారు. 'పొలిటికల్ మేనిఫెస్టోలు ప్రజల కోసమా.. అధికారం కోసమా..' అనే అంశంపై శ్రీవిజయనగర న్యాయ కళాశాల విద్యార్థులు శనివారం చర్చాగోష్టి నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఎం.మహేష్, జె.సోనీ, వై.ఐశ్వర్య, హరికృష్ణ, నాగరాజు చర్చాగోష్ఠిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మూడు బృందాల విద్యార్థులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ మానిఫెస్టోలను అరచేతిలో వైకుంఠం చూపించేవిగా, అధికారం చేజిక్కించుకోవటానికి, ప్రజలను ప్రలోభ పెట్టడానికి పనికి వస్తున్నాయి తప్ప.. ప్రజల అభివృద్ధికి పనికి రావడం లేదన్నారు. నాయకులు ప్రకటించే పథకాల సాధ్యాసాధ్యాలు పరిశీలించిన తర్వాలే మేనిఫెస్టోలో ప్రకటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్రచారి, ఫైనల్ ఇయర్ విద్యార్థులు షామీర్‌బాషా, యశ్వంత్‌కుమార్, ఎస్ఎస్.కుమార్‌గౌడ్, శివకుమారి, ఉమామహేశ్వరి, రేవతి, మొదటి, మూడవ సంవత్సరం విద్యార్థులు మహిమ, రేణుక, లక్ష్మీనందన్, జెన్నీఫర్, షోయబ్, నీలు ఫర్హానా, సుష్మాస్వరాజ్, పరమేశ్వర రెడ్డి, దామోదర్, సంధ్య, శివ తదితరులు పాల్గొన్నారు.



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న న్యాయ విద్యార్థి

రైతుల ఆత్మహత్యలపై దృష్టి సారించాలి

జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో ఎక్కువగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యపై ప్రభుత్వాలు దృషి సారించాలని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు కోరారు. ఈమేరకు ఉరవకొండకు విచ్చేసిన జిల్లా అగ్రికల్చరల్ అధికారి ఉమామహేశ్వరమ్మను శనివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. విచక్షణారహితంగా పురుగు మందులు, మోతాదు మించి రసాయన ఎరువులు వాడటం వల్ల కలిగే నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. అలాగే ప్రతి సంవత్సరం భూసార పరీక్షలు నిర్వహించి భూసార కార్డులను రైతులకు అందించాలన్నారు. వ్యవసాయాన్ని అజ్ఞానంలో నడిపిస్తే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. రైతు సోదరులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించే ప్రయత్నాన్ని అందరూ కలిసికట్టుగా సమైక్యత భావంతో చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు సురేంద్ర, రమేష్, ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, మండల వ్యవసాయ అధికారి శుభకర్, అనంతపురం జిల్లా డీఈవో కార్యాలయ ఎఒ రాకేష్, తదితరులు పాల్గొన్నారు



జిల్లా అగ్రికల్చరల్ అధికారి ఉమామహేశ్వరమ్మను సన్మానిస్తున్న జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు

బెలుగుప్ప తహశీల్దార్‌గా డి.ఓబులేసు



బెలుగుప్ప : మండల కేంద్రంలోని కార్యాలయంలో నూతన తహశీల్దార్‌గా డి.ఓబులేసు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన తనను పదోన్నతిపై ఉన్నతాధికారులు బెళుగుప్ప తహశీల్దార్‌గా నియమించినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, విఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం సచివాలయం ముట్టడి

ఉరవకొండ : తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలువురు మహిళలు శనివారం విడపనకల్ మండల కేంద్రంలోని సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి విడపనకల్‌లో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. మండల కేంద్రంలో తాగునీటి చెరువు ఉన్నప్పటికీ నీటి కటకట మాత్రం తప్పడం లేదన్నారు. సంబంధిత ఆర్డబ్ల్యుఎస్ అధికారులు మండల కేంద్రానికి రాకుండా, సమస్యలు తెలుసుకోకుండా ఎక్కడో ఉండి విధులు నిర్వహించడం వలనే ఈ పరిస్థితి దాపురించిందని వాపోయారు. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలో సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా విద్యుత్ ఛార్జీలు పెంచి పేదల నడ్డి విరిచారన్నారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.1,400 కోట్ల భారాన్ని సర్దుబాటు ఛార్జీల పేరుతో 2014 సంవత్సరం నుంచి యూనిట్‌కు 20 పైసలు చొప్పున అదనపు భారాన్ని వేస్తోందన్నారు. ఒకవైపు పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు వివిధ రకాలు ఛార్జీల పేరుతో ప్రభుత్వం ముక్కు పిండి వసూలు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో సోలార్, గాలిమరల ద్వారా విద్యుత్ పెరుగుతోందని చెబుతూనే రైతుల పైన భారం వేయడం ఎంతవరకూ సమంజమని ప్రశ్నించారు. కార్పొరేటు సంస్థలకు విద్యుత్ రంగాన్ని అప్పజెప్పడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామాంజనేయులు, సహాయ కార్యదర్శి సూరి, మండల కమిటీ నాయకులు వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, పెద్దయ్య, పూలరంగడు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

నిందితులకు శిక్ష పడాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : నమోదు చేసిన ప్రతి కేసులో నిందితులను గర్తించి శిక్ష పడేలా పోలీసులు, ఏపీపీలు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీసు అధికారులు, ఏపీపీలు, కోర్టు కానిస్టేబుళ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నేర నిరూపణ కాకుండా కొట్టివేసిన కేసులు, అందుకు కారణాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్షలు పడితే భవిష్యత్తులో నేరాల జోలికి వెళ్లకుండా ఉంటారన్నారు. అదే సమయంలో ప్రజల్లో భరోసా కలుగుతుందన్నారు. ఆ దిశగా అందరం సమన్వయంతో ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.రామిరెడ్డి, జి.రామకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రామ్‌నాయక్, డీఎస్పీలు, సిఐలు, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

అనంతపురం క్రైం : రూరల్ పరిధిలోని కురుగుంట గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు రాజప్ప, ప్రభాకర్ తమ గొర్రెలను అనంతపురంలో అమ్మడానికి శనివారం తెల్లవారుజామున బొలేరో వాహనంలో బయలుదేరారు. వాహనం అనంతపురం రూరల్ పరిధిలోని కురుగుంట గ్రామం వద్దకు రాగానే అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి వెళ్తున్న కోళ్ల లారీ ఢీకొట్టింది. దీంతో బొలేరో బోల్తా పడటంతో అందులోని రాజప్ప, ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డారు. గొర్రెల్లో కొన్ని మృతిచెందాయి. మరిన్ని గాయపడ్డాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం : శనివారం స్థానిక రుద్రంపేట బైపాస్ లో వాహనాలు తనిఖీ చేస్తుండగా 280 బ్యాగుల పీడీఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఫోర్త్ టౌన్ సీఐ ప్రతాపరెడ్డి తెలిపారు. ఐచర్ వాహనంతో పాటు టిప్పుసుల్తాన్, రామ్మోహన్ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి

గార్లదిన్నె : మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులు రూపొందించుకుంటున్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపిడిఒ తేజోష్ణ సూచించారు. హౌసింగ్‌డే సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జగనన్న లేఔట్ కాలనీ సందర్శించి లబ్ధిదారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. అంతేగాకుండా కాలనీలో మౌలిక వసతులు, రోడ్లు, కరెంటు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు పనిముట్లు పంపిణీ



కార్మికులకు పనిముట్లు అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన రైతు సోమనాథ్‌గౌడ్ పంచాయతీ కార్మికులకు శనివారం పనిముట్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా రైతు మాట్లాడుతూ కార్మికుల సౌకర్యార్థం చేతి తొడుగులు, గంపలు, పారలను అందజేసినట్లు తెలిపారు. గ్రామాన్ని శుభ్రం చేస్తున్న కార్మికులకు తనవంతు సహాయం అందించినట్లు తెలిపారు.

పీపీలకు ఘన సన్మానం

గుత్తి : పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను శనివారం గుత్తి బార్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన హరినాథ్‌రెడ్డి, గుత్తి 6వ ఆదనపు న్యాయమూర్తి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సుదర్శన్‌రెడ్డిని శాలువా, పూలమాలతో నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సచివాలయాల కన్వీనర్ వై.సుభాష్‌రెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు ఉమాపతి, తిమ్మారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, వాల్మీకి శివరాం, తదితరులు పాల్గొన్నారు.



పీపీలను సన్మానిస్తున్న గుత్తి బార్ అసోసియేషన్ నాయకులు

ఇంటర్ టాపర్‌కు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

ఉరవకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ ఇంటర్ బైపిసి గ్రూపులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1000 మార్కులకు 975 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన దేవిని ఘనంగా సన్మానించారు. శనివారం అనంతపురంలో జరిగిన జగనన్న ఆణిముత్యాల జిల్లా కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి, మంత్రి ఉషశ్రీచరణ్, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం ఆధ్వర్యంలో విద్యార్థినిని సన్మానించడంతోపాటు రూ.50వేల నగదు పురస్కారాన్ని అందజేశారు.

డీఐజీని కలిసిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ : అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు అనంతపురంలోని డీఐజీ కార్యాలయంలో డిఐజిని కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్చం ఇచ్చి అభినందించారు.



డిఐజి అమ్మిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

రోడ్డు నిబంధనలపై అవగాహన



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సిఐ వెంకటరామిరెడ్డి

గుత్తి : పట్టణంలోని క్రీడా మైదానంలో శనివారం రోడ్డు నిబంధనలపై సీఐ ఎం.వెంకటరామిరెడ్డి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని సూచించారు. అలాగే మద్యపానం చేసి వాహనం నడపరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలుగేటు మరమ్మతులు పూర్తి



పూర్తయిన రైల్వేగేటును పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం : రాయదుర్గంలోని బీటీ ప్రాజెక్టు రోడ్డులో ఉన్న లెవెల్ క్రాసింగ్ నెంబర్.94 రైల్వే గేటు మరమ్మత్తులు పూర్తయినట్లు నైరుతీ రైల్వే మైసురు డివిజన్‌లోని మొలకల్మూరు సినీయర్ ఇంజినీర్ రాకేష్‌కుమార్‌మీనా తెలిపారు. మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో ఈరోడ్డుపై వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగించవచ్చన్నారు. మరమ్మతుల కోసం రెండు రోజులపాటు వాహనాల రాకపోకలు బంద్ చేసినప్పటికీ మొదటి రోజే మరమ్మతులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేట్ జనార్ధన్, పీరా, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

కుష్టు నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-అనంతపురం

కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహనపై సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ముందుగా ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈనెల 26 నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకూ కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆశా కార్యకర్తలు, కుష్టువ్యాధి సర్వే వాలంటీర్లు రోజూ 20 నుంచి 35 ఇళ్లను సర్వే నిర్వహించి ఇంట్లోని సభ్యులకు కుష్టి వ్యాధి గురించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే అనుమానితులను గుర్తించాలన్నారు. అనుమానిత లక్షణాలున్న వారిని గ్రామాలకు దగ్గరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులకు పరీక్ష నిమిత్తం పంపాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగితే అక్కడినుండి పట్టణ ఆరోగ్య కేంద్రమునకు రిఫర్ చేసి వైద్యం అందించాలన్నారు. ఈ కుష్టు వ్యాధి చికిత్సకు వైద్యం ఉచితంగా అందించబడుతుందని తెలిపారు. కుష్టు వ్యాధి వల్ల అంగవైకల్యం పొందిన వ్యాధిగ్రస్తులకు అంగవైకల్యం సరి చేయుటకు పలమనేరు ఆసుపత్రిలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ కృష్ణవేణి, మరియు జిల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రెండవ రోడ్డులోని వైఎస్ఆర్ పార్టీ కార్యాలయం సమీపంలో ఉన్న కూడలి వద్ద శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో డిపి షుగర్ వంటి సమస్యలను నిర్ధారించి నిర్ధారించి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ రెడ్డి మిత్ర బృందం ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ప్రజాశక్తి-నార్పల

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందని డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నార్పల క్రాస్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. నేరాల నియంత్రణ మరియు నేరాల గుర్తింపులో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడత్యాన్నారు. అలాగే మంచి పనుల కోసం ప్రజలకు సేవ చేయడం కోసం అనంతపురం పోలీస్ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ప్రజలు కూడా తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది, దాతలు తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

'జగనన్న సురక్ష'ను పటిష్టంగా అమలు చేయాలి



గుత్తిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో భాగంగా ఈనెల ఈనెల 23 నుంచి వచ్చేనెల 23వ తేదీ వరకూ నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్షా కార్యక్రమం గురించి వివరించాలన్నారు. ఏ ఇంటికి సంబంధించి ఏ రకమైన వినతి అయినా.. ఏదైనా పత్రాలకు సంబంధించిగానీ, డెత్, ఇన్‌కం, మ్యారేజీ సర్టిఫికెట్లకు సంబంధించిగానీ, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా? లేవా? అన్నదానిపై జల్లెడ పట్టాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దార్, ఒక టీం, తహశీల్దార్, ఇఒ పంచాయతీరాజ్ కలిసి రెండు టీమ్‌లుగా ఏర్పడతాయన్నారు. ఈ రెండు బృందాలు గ్రామాలకు వెళ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం కోసం ఈనెల 23 నుంచి వచ్చేనెల 23వ తేదీవరకూ నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపిడిఒ దివాకర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతోపాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వివిధ శాఖల సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : జగనన్న సురక్ష ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ విజయభాస్కర్ సూచించారు. శనివారం మండలంలోని ఓబులాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం హౌసింగ్ డే సందర్భంగా దయ్యాలకుంటపల్లి జగనన్న లేఔట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఈనెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

గుత్తి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు గ్రామస్థాయి సచివాలయంలో నెలకొన్న సమస్యలను ఎలా పరిష్కరించాలో అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ వెల్ఫేర్ సహాయకులు, డిజిటల్ సహాయకులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తేజోష్ణ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ పిలుపునిచ్చారు. పట్టణంలోని టిటిడి కల్యాణ మంటపంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై వార్డు సెక్రటరీలు, వాలంటీర్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ హసీన సుల్తాన పాల్గొన్నారు.

కొత్తచెరువు : 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా అధికారులు, సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని 13 సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఒ సిద్ధారెడ్డి, తహశీల్దార్ రామాంజ నేయరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వాలంటీ ర్లు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ శకుంతల ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు, ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. అలాగే ఇంటింటికీ వెళ్లి వారికి అందాల్సిన ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవలపై ఆరా తీయాలన్నారు. ఏ గ్రామానికి వెళ్లాలో ముందుగా వారికి సమాచారం ఇచ్చి బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ క్రాంతికుమార్, ఆర్ఐ అశోక్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయభాస్కర్

ఓబుళదేవరచెరువు: ప్రజా సమస్యలను పరిష్కరించడం, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ఈ నెల 23 నుంచి జూలై 23వ తేదీ వరకూ జగనన్న సురక్ష కార్యక్రమా న్ని చిత్తశుద్ధితో అమలు చేయడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రమేష్ సూచిం చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో రమేష్ మాట్లాడు తూ ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురించి వివరించాలన్నారు. సమావేశంలో ఎంపిపి పర్వీన్‌బాను, తహశీల్దార్ శ్రీధర్, ఏవో పూల రెడ్డప్ప, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ప్రజల సమస్యల పరిష్కారమే 'జగనన్న సురక్ష' లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం 'జగనన్న సురక్ష'పై నిర్వహించిన కార్యక్రమంలో డిఎల్‌పిఒ శివారెడ్డి, తహశీల్దార్ సురేష్‌కుమార్, ఎంపిడిఒ నాగరాజురావు, ఎంఈఓ ఆంజనేయనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయా ల్లో సుమారు 30 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, గ్రామ రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లతో ఎంపిడిఒ నరసింహనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ బాబు హాజరై జగనన్న సురక్ష పథకం గురించి వివరించారు. సమావేశంలో ఈఓఆర్‌డి శివన్న, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, దుర్గయ్య, ఆనంద్ కుమార్, గ్రామం రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

'ఆణిముత్యాలు'కు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-పుట్లూరు

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమదులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు పల్లవి, శ్రావణి, లహరి, శ్రేయకు పతకాలు, సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బాబు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని గురుకుల పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురుకుల గిరిజన సంక్షేమ జిల్లా అధికారి అన్నా దొర, ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ 2022-23లో పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో బహమతులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే సిద్ధరాంపురం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో సమూల మార్పులు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

యాడికి : జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణి మార్కులతో పాసైన ముగ్గురు విద్యార్థినులను శనివారం ఘనంగా సన్మానించడంతోపాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేకాధికారిణి నిర్మల మాట్లాడుతూ అత్యుత్తమ మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి మన పాఠశాల బాలికలు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాయదుర్గం : జగనన్న అణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కల్లీమఠం మున్సిపల్ హైస్కూల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్‌పర్సన్ లక్ష్మి, వైస్‌ఛైర్మన్ సోమ రవి, వార్డు ఇన్‌ఛార్జి పోరాళు శివ పాల్గొన్నారు.